# కలికి గాంధారి

■ ఐతా చంద్రయ్య



గాంధారీ! నువ్వు విడుదలయ్యేది రేపే కదా!" నవ్వాలో బాధపడాలో అర్థంగాక అప్పుడే నైట్ డ్యూటీకొచ్చిన నారాయణ గొంతు వణికింది.

"అవునన్నా! రేపే ఎల్లిపోతున్న." పడుకోవాలనుకున్న గాంధారి ఆ ప్రయత్నం మానుకుంది. నవ్వుతూ నారాయణ వైపు దృష్టి మరల్చింది. గోడకొరిగి మోకాళ్ళ మీద తలానించి కూర్చుంది.

"బువ్వదిన్నవా మంచిగ!"

"తిన్న. మన జైల్ల గూట్లే దీపం, నోట్లే బుక్కగదన్నా!"

రాత్రి భోజనాలైపోగానే ఖైదీలు తమ తమ గదుల్లో నత్తగుల్లల్లా ముడుచుకుంటున్నారు. చలిపులి ఎముకల్ని చప్పరిస్తూంటే కొందరు అన్నీ మరచి నిద్రాదేవి కౌగిట్లో ఒరిగిపోతున్నారు. మరి కొందరు ఏదీ మరువలేక గతం చేదు అనుభవాలను మనో యవనిక మీదికి చేదుకుంటున్నారు. వ్యాపకాలు, జ్ఞాపకాలు దాగుడు మూతలాడుతూ నిద్రకు దూరం చేస్తున్నాయి.

అది సెంట్రల్ జైలు. వందల కొద్దీ ఖైదీలున్నారందులో. తగిన సిబ్బంది కూడా ఉంది. అధికారుల నుండి అటెండర్ల దాకా, జేబు దొంగల నుండి జీపు దొంగల దాకా గాంధారిని గుర్తుబట్టనివారు లేరు. ఆమె ఒక ఖైదీ.

అందరిలాగే గాంధారి గూడా రోజూ రెక్కలు ముక్కలు చేసుకుంటుంది. సంవత్సరమంతా కష్టపడి సంపాదించిన డబ్బుతో రక్షాబంధన్ నాడు రాఖీలు కొనేస్తుంది. మగవాళ్ళందరికీ కట్టేస్తుంది. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తుంది. ఆడ ఖైదీలనైతే ఆత్మీయతానురాగాల్లో ముంచెత్తి అక్కున చేర్చుకుంటుంది. వాళ్ళ కష్టాలు వింటుంది. భగభగమండే గుండెలను తన చల్లని మాటల వెన్నతో చల్లబరుస్తుంది.

గింత మంచి గాంధారి గంత పెద్ద నేరమెందుకు జేసిందో అన్నది అందరినీ వేధిస్తుంది. అదే విషయమెవరన్నా అడిగితే, "అది నా కర్మ. దేవుడట్లా చేయించిండు. నేం జేసిన" అని యోగినిలా చెప్పేస్తుంది. ఎన్నిసార్లు ఎందరడిగినా అదే జవాబు.

పట్టువదలని విక్రమార్కుడిలా నారాయణ మాత్రం ఆమె అంతరంగ తరంగ ధ్వనులను విని తీరాలనే నిర్ణయించుకున్నాడు. ఈ రోజే, ఇప్పుడే తగిన సమయమనే పట్టుదలతో తయారయ్యాడు.

"గాంధారీ! నాకు తోడబుట్టిన అక్కాచెల్లెళ్ళు లేరు. ఏటేటా రాఖీ కడుతున్నవు కాబట్టి నువ్వే చెల్లెవనుకుంటి."

"అవునన్నా! నాకూ తోడపుట్టిన అన్నాదమ్ములు లేరు. నువ్వేమో సొంత అన్న లెక్క రోజూ మాట్లాడిస్తుంటివి. జొరమొస్తే గోలీలు తెచ్చిస్తివి. నువ్వే నా అన్నవనుకుంటున్నా." కపోలాల మీదాడుకుంటున్న ముంగురుల్ని మునివేళ్ళతో సవరించుకుంటూ అంది గాంధారి.

"అన్న చెల్లెండ్లు కష్టసుఖాలు చెప్పుకుంటరు గదా!"

"అవునన్నా! చెప్పుకుంటేనే మనసు బరువు దిగిపోతుంది."

"అయితే, నువ్వు గంత పెద్ద నేరమెందుకు జేసినవ్? చెప్పకపోతే నా మీద ఒట్టే..."

"అన్నా!" రపీమని తల పైకి లేచింది. ఆ ముఖం కడిగిన ముత్యం లాగుంది. "గట్ల ఒట్టు పెడితే ఎట్లన్నా? నువ్వు నాలుగు కాలాల పాటు సల్లగుండాలన్నా!" నరాల్లో ప్రకంపనలు.

"అయితే, నువ్విప్పుడే చెప్పి తీరాలె. ఆc...!"

"మరి నీ డ్యూటీ!" భ్రుకుటి ముడిపడింది.

"ఇంకా కొందరు గార్డులున్నారు గదా. వాళ్ళకు చెప్పి వచ్చిన."

గాంధారి చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోయినై.

"చేసిన పాపం చెప్తే పోతుందంటరు గదా. చెప్తా విను..." కొంగు భుజాల నిండా కప్పుకుంది.

"చెప్పమ్మా!" తుపాకీ పక్కనబెట్టి సర్దుక్కూర్చున్నాడు.

గుండెల్లోని చిచ్చును గప్‌చుప్‌గా దాచుకున్న ఖైదీ అటు, కంచాలు మోయలేక, లంచాలు మేపలేక కింది స్థాయిలోనే స్థిరపడిన గార్డు ఇటు. ఇద్దరి మధ్యన కఠిన సత్యాలు వింటున్న కటకటాలు.

"మెదకు జిల్లాల మాదో పల్లెటూరన్నా. ఏ జన్మల ఏం పాపం జేసినమోగాని మా జాతోళ్ళకు తల్లి పేరే తెలుసుగాని, తండ్రి పేరు దెల్వదు. తెలిసినా చెప్పగూడదు. చెబితే బతుకు బండల పాలైపోతది."

"అరే... గదేందీ. గమ్మత్తుగుంది." క్యాపు తీసి నెత్తి గోక్కున్నాడు నారాయణ.

"గదంతే నన్నా! మా అమ్మకు చిన్నప్పుడే దేవున్తోని పెండ్లి జేసింద్రటా..."

"ఓర్నీయవ్వ! దేవున్తోనా? గదేమన్నా బొమ్మల పెండ్లా?" క్యాపు తిరిగి నెత్తిమీదికొచ్చింది.

"అవును. మనుషులంతా దేవుని చేతుల బొమ్మలంటరు గాని, మేం మాత్రం మనుషుల చేతుల బొమ్మలం. 'పేరు పెరుమాండ్లది, ఆరగింపు అయ్యగారి'దంటరు గదా! మా అమ్మ పని గూడా గంతే అయిందట. గుడి సత్రముల ఓ అర్రనే మా ఇల్లు. పొద్దంతా గుడి ముంగిట జోలె పట్టి అడుక్కోవాలె. చీకటి పడ్డంక పులి నోట్లో తలకాయ పెట్టినట్టు బలమున్నోని చేతులల్ల నలిగిపోవాలె. మా ఊర్లె పెద్ద జమీందార్ రంగారావు దొర. ఆయన రోజూ మా ఇంటికొచ్చెటోడట. ఊరంతా అతడంటే హడలట. పగలు ఆ దొరకెదురుంగ నిల్చుండి మాట్లాడినోని పానం రాత్రికి రాత్రే ఎగిరిపోయేదట. నైజాం జమానల వాళ్ళ తండ్రికి సంస్థానముండేదట."

"అట్లనా..."

"ఆc... ఇంట్ల బంగారబ్బొమ్మోలె దొర్సాని ఉండంగ గూడ మా అమ్మ కోసం వచ్చేటోడట. నన్ను పుట్టించిన గా దొరను నేను నాయినా అని పిలువొద్దన్నరు. మీ అయ్య ఎవలని తోటి పిల్లలడిగితే కండ్లల్ల నీరు దిరిగేయి. అందరు పిల్లలోలె నేను గూడా బడికి పోయేదాన్ని. ఓ రోజు రంగారావు దొర జూసిండు. కండ్లబొమ్మ లెగిరేసి గుర్కాయించి చూసిండు. జీతగాళ్ళకేం సైగ జేసిండో ఏమో గాని వాళ్ళు నా రెక్కలు పట్టుకుని మా ఇంటికి గుంజుకొచ్చింద్రు. రంగారావు దొర మీసాలు దింపిండు. పండ్లు కొరుక్కుంట నా చెంపలు వాయించిండు.

'బాంచత్! నీగ్గూడా సదువు గావాల్నే పోరీ' అనుకుంట మా అమ్మ సిగపట్టి గుంజి ఈపు మీద పెడాపెడా గుద్దిండు. మా అమ్మ నోరు దెరువలేదు. గుడ్ల నీళ్ళు గుడ్లల్ల కుక్కుకుంది. ఊపిరి బిగపట్టి ఏడుపు ఆపుకుంది. నాకేమో దొరను కరకర నమిలి మింగాలనిపించింది. ఏడ్చుకుంట ఉరికి మా అమ్మమ్మ సంకలెక్కిన.

మా అమ్మమ్మకేమనిపించిందో. నన్ను కిందికి దించి, 'దొరా! బుచ్చిపోరి సదూకుంటనంటున్నది. నాలుగచ్చరాలు రాంగనే బడికి బందజేస్తం' అనుకుంట దండం బెట్టింది. కాళ్ళు పట్టుకుంది.

దొరక్కోపం మించుకపోయిందేమో అమ్మమ్మ సిగపట్టి లేపి పొత్తి కడుపుల ఒక్క గుద్దు గుద్దిండు.

'ముండా! నేను వద్దంటే నువ్వు సదివిస్తనంటవా?' అనుకుంట ఎక్కడపడితే అక్కడ పిడికిలితోని గుద్దుతున్నడు. అమ్మా, నేను మొత్తుకున్నం. నెత్తిగొట్టుకున్నం. అమ్మమ్మ కింద పడ్డది. దొర బూటు కాలు దాని పక్క బొక్కల మీద గంతులేసింది. అమ్మ దొర కాళ్ళు పట్టుకుని, 'గా ముసల్దాని కేమెరుక దొరా! ఏదో తెలువక అన్నది. మాఫ్‌జెయ్ దొరా' అంటూ బతిమాలింది.

'నీ బిడ్డ మొకం జూసి ఇడిచి పెడ్తున్నా'నని ఎల్లిపోయిండు.

అమ్మమ్మ మెడగోసిన మేక పిల్లోలె కొట్టుకుని, కొట్టుకుని చచ్చిపోయింది. అమ్మా, నేను దిక్కులేని పక్షులోలె నెత్తి గొంటుకుంట, లబలబ మొత్తుకుంట ఏడ్చినం. వాడకట్టోల్లు వచ్చి పీనుగను జల్ది దీసెయ్యాలన్నరు. ఎట్టి బ్యాగరోల్లొచ్చి అమ్మమ్మను గుంజుక పోతుంటే మేము గుండెల మీద కొట్టుకున్నం. చూసినోళ్ళు కంట తడి పెట్టింద్రు గాని నోర్లు దెరువ లేదు.

ల్యాత మేక మాంసం మరిగిన తోడేలోలె తెల్లారే రంగారావు దొర మా ఇంటికొచ్చిండన్నా! అమ్మ ఏడుస్తుంటే 'సచ్చినోల్లతోని మనం బోతమా?' అని రెక్కపట్టి అర్రలకు తోలుకపోయిండు.

కొంటె పోరగాండ్లు 'దొరకు మరిగిన దొర్సాని' అనుకుంట మా అమ్మ మీది మీది కొచ్చేటోళ్ళు.

నాకు పద్నాలుగేండ్ల వయసొచ్చింది. పొలంల పాము కాటేసి రంగారావు దొర నచ్చిపోయిండప్పటికి. ఒక రోజు ఊరి పెద్దలంతా మా ఇంటికొచ్చింద్రు. దేవుని గుడిల పందిరేసింద్రు. ఓ ముసలి ముత్తైద నన్ను పీట మీద కూచోబెట్టింది. బొట్టుపెట్టి కొత్త బట్టలు చేతికిచ్చింది. కట్టుకొమ్మంది. కొత్త బట్టలు చూడంగనే నాకు కోతి చేతికి కొబ్బెరి చిప్ప దొరికినంత ఇదైంది. సంతోషంగ కట్టుకున్న. నన్ను బాగా అలంకరించింద్రు. ఆ ముత్తైద నన్ను కింది నుంచి మీద్దాకా చూచి, 'జాంపండోలున్నవు బిడ్డా! ఊరి పోరగాండ్లంతా ఊరకుక్కలోలె మీద పడ్తరేమో, జర జాగర్త' అన్నది.

సొన్నాయి సప్పుడుతోని గుల్లెకు తోలుకపోయింద్రు. మంత్రాలు చదివింద్రు. ఏందేందో చేసి, 'నీకు దేవున్తోని లగ్గమైంది' అన్నరు. మా అమ్మతోని ఎవలెవలో ఏదేదో మాట్లాడింద్రు. రాత్రికి నాకు సన్న బియ్యం బువ్వ పెట్టింద్రు. కొత్త తెల్ల చీరె గట్టిచ్చింద్రు. జడల కనకాంబరాలు, కండ్లకు కాటిక పెట్టింద్రు. మల్లా పెండ్లి పిల్లోలె తయారు జేసింద్రు. మా అమ్మ నా నుదుటి మీద ముద్దు పెట్టి, 'మన

జోగిను
లకు గింతే బాకి
గాంధారీ! దొర ఏం జేసినా
నువ్వేమనద్దు' అని అర్రలకు తోలి తలుపేసింది.

అర్రల మల్లెపూలు జల్లిన పట్టె మంచముంది. దాని మీద ఎల్లారావు దొర నవ్వుతుండు. అతడు రంగారావు దొర కొడుకు. అతని పెండ్లిల నేను డ్యాన్సు జేసిన. మంచం పక్కన ప్లేట్లల్ల లడ్డూలు, బూంది కనిపించినై. దొర ఓ లడ్డూ నా నోట్లో పెట్టిండు.

'ఈ లడ్డూ కంటే నువ్వే మంచిగున్నవు' అనుకుంట నన్ను తన మీదికి గుంజుకున్నడు. చెంపల మీద. పెదాల మీద ముద్దులు పెట్టిండు. సక్కిలిగులు జేసిండు. ఇంకేదేదో చేస్తుంటే నాకు భయమైంది.

'గిదేంది దొరా!' అనుకుంట మంచం దిగబోయిన.



'జర్రాగు. నీకే తెలుస్తది' అని గట్టిగ పట్టుకున్నడు.

నేను పిట్ట పిల్లోలె వణికిపోయిన.

ఎంత మొత్తుకున్నా ఇడిచి పెట్టలేదు. ఆ రోజు నుంచి రోజూ నాకోసమొచ్చిండు.

నాకిష్టం లేకున్నా నాకో కూతురు పుట్టింది. దానికి మా అమ్మ మేనక అని పేరు పెట్టింది. అది పుట్టిననాడే ఎల్లారావుకు సర్కారు నౌకరి దొరికింది. ఆయన తన కొడుకును వాళ్ళమ్మ దగ్గరుంచి పెండ్లాంతోని పోయిండని తెలిసింది. అంతకు ముందే మాకో గుడిసె కట్టించి ఇచ్చిండు. అప్పుడప్పుడు గానం పంపించెటోడు.

మేము దిక్కులేనోళ్ళమైనం. జోలెవట్టుడు బంద్ జేసి కూలికి వోయినం. ఎవ్వలేమని లొల్లి వెట్టినా నోరు మూసుకున్నం. కాని, లోకులు కాకులై కూస్తుంటే నాకు సచ్చిపోవాలనిపించేది. ఓసారి మనసంతా కలికలైంది.

'ఊర్లె ఆడపిల్లలంతా పెండ్లిల్లు జేస్కొని సుఖాంగుంటె మనం గిట్లెందుకుండాలమ్మా? మన పక్కల పడుకున్నోళ్లే మనల్ని పురుగులోలె జూస్తున్నారు. ఎల్లారావు నాకు అన్న అవుతడు. అయినా గూడా పశువోలె వచ్చె. నన్ను తల్లిని జేసె. గిదేం న్యాయం?' అడిగిన అమ్మను.

'మనకు గిట్లే రాసిండా దేవుడు' అని ఎక్కెక్కి ఏడ్చింది అమ్మ. గప్పుడే నా పిల్లను బడికి దోలిచ్చినం. టీచర్లు దాన్ని హుషారు పిల్ల అనేటోల్లు.

మేనక పదోతరగతి ఫస్ట్ క్లాసుల పాసైంది. మాయదారి రోగమొచ్చి మా అమ్మ సచ్చిపోయింది.

గవర్నమెంటుకు మా మీద దయగల్గింది. కలెక్టర్ మా ఇంటికొచ్చి ధైర్యం జెప్పిండు. మేనకను కాలేజీల చదివించుమని పైసలిప్పిచ్చిండు. మేనక రోజూ బస్సుల పట్నం బోయి బాగా సదువుకుంది. అయిదేండ్లల్ల నా మేనక అచ్చం స్వర్గలోకంలున్న మేనకోలె తయారైంది.

అది పట్నంల రఘురాం అనే టీచర్ను ప్రేమించిందట. ఆ పిల్లగాడు మా ఇంటికొచ్చిండోసారి. చానా మంచి గుణమట. బంగారమోలున్నడు. ఈడు జోడు మంచిగుంది. మంచిగ మాట్లాడిండు. మంచి మూర్తం జూసి మేనకను పెండ్లి జేసుకుంటనన్నడు..."

గాంధారి అంతరంగం అల్లకల్లోలమైంది. గొంతు బొంగురు పోయింది. పెదాలు వణికినై. కళ్ళు చెమ్మగిల్లినై. చలికి తట్టుకునేందుకు నారాయణ బీడీ అంటించి దమ్ము పీల్చాడు. గుండెలకు హాయిగుంది.

"మీదున్నోడు ఎట్లాడిస్తే మనం గట్లాడ్తం గాంధారీ!" నిట్టూర్చాడు.

"ఎప్పుడేం జరగాల్నో వాడే చూస్కుంటడు. రేపైతే మనకు కొత్త సూపర్నెంటు వస్తడు. అతడెసొంటోడో ఏమో! రేపీ టయానికి నువ్వు నీ బిడ్డ దగ్గరుంటవు. ఖైదీలకు జైలు శిక్ష గిన్నేండ్లని ఉంటది. మాకు మాత్రం సదా ఎల్లకాలం జైలు శిక్షే. గిప్పుడు మా సంగతి ఎందుగ్గానీ... నువ్వు అసలు సంగతి చెప్పెయ్ చెల్లే!"

"చెప్తానన్నా..." కపోలాల మీదికి జారి మెరుస్తున్న కన్నీటి బొట్లను కొంగుతో అద్దుకుంటూ గాంధారి మళ్ళీ చెప్పసాగింది.

గుండెల్లో చిచ్చును దాచుకున్న
ఖైదీ అటు, లంచాలు మేపలేక
కిందే స్థిరపడిన గార్డు ఇటు.
ఇద్దరి మధ్యన కఠిన సత్యాలు
వింటున్న కటకటాలు.

"గాయాల్ల... చీకటి పడుతూంది. నేను కూలికి వొయ్యి వచ్చిన. నా బిడ్డ ఆఖరి పరీక్ష రాసొచ్చింది. చెరో బుక్కెడంత దిని పడుకుంటున్నం. ఎవలో తలుపు గొట్టిండ్రు. మాకెప్పుడూ ధైర్యం జెప్పే గుడి పూజారనుకుని తలుపు దీసిన. వచ్చినోడు పూజారి కాదు. ఎల్లారావు దొర కొడుకు కమలాకర్రావు. హైదరాబాదుల ఏదో కోర్సు సదివి ఫెయిలై గప్పుడే వచ్చిండు. పైసలున్నోడు. కోరవయసులున్నడు. బ్రాందీ వాసనొచ్చింది. కండ్లు ఎర్రపూవులోలున్నై.

'ఏంది చిన్న దొరా!' అడిగి అడ్డం నిల్చున్న.

'పనిమీద వచ్చిన' అనుకుంట నన్ను పక్కకు నూకేసిండు. ఒడిశెల గుండోలె ఉరికొచ్చిండు. గొర్రె మీద తోడేలోలె మేనక మీద పడ్డడు. నా కాళ్ళు వొయ్యి కడుపుల జొచ్చినై. ఎంత సదివిందైనా అది ఆడపోరాయె. అయినా గూడా–

'ఎవర్రా నువ్వు' అని ఒక్క తన్ను దన్నింది. వాడు ఎల్లెల్కల పడ్డడు. ఎంటనే లేచిండు.

'రేపు దీనికి దేవున్తోని పెండ్లి జేయిస్త. గడ్బడొద్దు' అని యాభై రూపాయల నోట్ల కట్ట నా చేతుల పెట్టిండు.

ఊరు మారిపోయిందనుకున్నాంగానీ మల్లా గిదేందీ? జెర్రసేపు నోటి మాట రాలేదు. కోపమొచ్చింది. భయం గూడా పోలేదు. ఎంతైనా దొరల పిల్లగాడాయె. కానీ, ధైర్యం జెయ్యకపోతే వీడు నా

బిడ్డ బతుకుతోని బతుకమ్మాడ్తడు. దాని జిందగీ గూడా కుక్కలు చింపిన ఇస్తారైతది. ఎంటనే రూపాయల కట్ట అతని మొకమ్మీదికిసిరికొట్టిన.

'వద్దు దొరా! నీకు చెల్లెలైతది. దానికి పెండ్లి గూడా ఖాయమైంది. ఇది ధర్మం గాదు. ఎల్లిపో' అని బతిలాడిన.

'నీయవ్వ! జోలె పట్టుకున్న జోగినోల్లగ్గూడా వరుసలా! మా నాయినకు నువ్వెట్లనో ఇది నా కట్ల. నువ్వటువో' అని మల్లా మేనక మీద పడ్డడు. అది లెవ్వవోయింది. కాని బలవంతంగా ఆపి ఏమేమో చెస్తుండు. వాళ్ళిద్దరు కలెవడ్డరు. గుంజులాడు కుంటున్నరు.

అరె, ఇంగ మా పని గింతేనా? వద్దు. నా అమ్మోలె, నావోలె నా బిడ్డ బతుకు గలీజు కావద్దు. అది బురుదల దిగవడద్దు. అది పెండ్లి జేసుకొని సుఖం గుండాలె అని గట్టిగ అనుకున్న. దానికోస మేంజేసినా సరేనని కూరగాయలు కోసుకునే బాకు అందుకున్న.

అరేయ్! నువ్వు దాన్నిడువకపోతే పొడిచి పారేస్తరా!' గట్టిగ లొల్లివెట్టిన. వాడు పండ్లు గొరుక్కుంట నా దిక్కు మర్లిండు. నా మెడకాయందుకోవోయిండు. బస్... నా రక్తం సలసల కాగింది. నేనేం జేస్తున్ననో నాకే తెల్వలేదు. తెగింపు జేసిన. కత్తిలావట్టిన. వాని కడుపుల కసకస పొడిచి పారేసిన. రక్తం... ఇల్లంతా రక్తం.

మెడగోసిన మేకపిల్లోలె వాడు గిలగిల కొట్టుకుంటుండు. మేనక పరేశానైంది. పిచ్చి దానోలె చూస్తుంది. దాని ఈపు మీద చెయ్యేసి, 'భయపడకు బిడ్డా! నీకు మంచి తొవ్వ దొరకాలంటే ఇది తప్పలేదు' అని ధైర్యం జెప్పిన. 'ఆఖరు బస్సుంది. నువ్వు పట్నం బొయ్యి రఘురాంను కలుసుకో. అతన్తోని పోలీస్ స్టేషన్‌కు వొయ్యి ఇదంతా చెప్పు. పో. ఎంటనే పో. ఆలిశమైతే ఆగమైపోతవు. పో' అని గద్దించిన.

'మరి... మరి నువ్వమ్మా' అని గొల్లుమంది.

'ఓ పిచ్చిదానా! నా సంగతి మర్చిపో. నీ సంగతి చూసుకో. నువ్వు బాగుంటే నాకేం ఫికర్ లేదు. పో' అని తరిమేసిన.

* * *

కొత్త సూపర్నెంటు పర్యవేక్షణలో గాంధారి విడుదలైంది. బయటి గేటు దాకా వచ్చింది. తోడబుట్టి కూడ పెరిగిన సొంత చెల్లెని అత్తారింటికి పంపిస్తున్నట్టు నారాయణ ఎదలో అష్టమ సముద్రం పొంగింది. ఆ పొంగు పొంగుతో కళ్ళు మసక బారినా గాంధారి వెంటనే నడుస్తున్నాడు.

జైలు బయట రఘురాం, మేనక దంపతులు, వారి కలల పంట చిన్నారి గంధర్వ రాజు తనను స్వాగతించేందుకు ఎదురు చూస్తున్నారని తెలిసిన గాంధారి తృప్తిగా గేటు దాటబోయింది.

"గాంధారక్కా!" వెనకనుంచి మరో సెంట్రీ పిలుపు.

"ఏందీ తమ్మీ!" కాళ్ళకు బ్రేకులు పడినై.

"నిన్ను కొత్తసూపర్నెంటు రమ్మంటున్నారక్కా!"

"ఎందుకటా?"

"ఏమో, నాకేం దెల్సు?"

గాంధారి చూపులు నారాయణ వైపు మళ్ళినై.

'విడుదలైన ఖైదీలతో కొత్త సూపర్నెంటుకేం పని? ఈయన కరక్ట్ మనిషో, కరప్ట్ మనిషో, కర్కోటకుడో తెల్వదాయె. ఎందుకైనా మంచిది నేను వెంట ఉంటాను.' నిర్ణయించుకున్నాడు నారాయణ. 'నీకేం భయం లేదు. నేనున్నా పద' అన్నాడు సైగలతో.

"బాగున్నావా గాంధారీ?"

కొత్త సూపర్నెంటు పలుకరింపునకు నివ్వెర పోయింది గాంధారి. భయపడితే భంగపాటు తప్పదనుకుంది.

"గిట్లున్న ఎల్లారావు దొరా" అంది ధైర్యంగా.

"నువ్వు ఈ జైల్లనే ఉన్నవని నాకు దెల్సు."



"నీకు సర్కారు నౌకరని తెల్సుగానీ, గీ నౌకరని తెల్వదు." ఆమె మాటల్లో ఆత్మవిశ్వాసం, చూపుల్లో చురుకుదనం.

"ఓహో! తొందరగానే గుర్తుబట్టావే. కూచో!"

"మనిషి మనిషిని మరవొచ్చుగాని, పొత్తి కడుపుల కొమ్ముతోని పొడిచిన దున్నపోతును మనసు మరుస్తదా?"

బయట నుంచున్న నారాయణకంతా వినబడు తోంది, కనబడుతోంది గూడా.

"ఒక్కగానొక్క నా కొడుకు నీ చేతుల చచ్చిండు. ఆ వార్త విని నా భార్య గుండె ఆగి చచ్చిపోయింది." ఎల్లారావు గొంతు గురగురలాడింది.

"కానీ, నేను మారిపోయాను గాంధారీ! ఇప్పుడు నిన్ను నా భార్యగా..." "వద్దు... వద్దు..." గాంధారి అరిచింది. నాలుగు దిక్కులు దద్దరిల్లినై.

"నా... నా... వంశం నిర్వంశమైపోయింది గాంధారీ!" తానో పెద్ద అధికారినన్న సంగతి మరిచాడు ఎల్లారావు.

"కానీ, నా సంగతి గట్లలేదు. నా కూతురు మేనక బాగా సదువుకుంది. దానికి రఘురాం అనే టీచర్తో పెండ్లయింది. నాకో కొత్త వంశం శురువైంది. ఎవ్వలు జేసిన పాపం వాళ్ళనే పామై కరుస్తుంది గద దొరా!" మాటలు ఈటెలైపోయినై.

"కానీ, నేను మారిపోయాను గాంధారీ! ఇప్పుడు నిన్ను నా భార్యగా..."

"థూ... వద్దు..." గాంధారి అరిచింది.

నాలుగు దిక్కులు దద్దరిల్లినై.

నారాయణ లోపలి కొచ్చేశాడని గమనించి రెండడుగులు పక్కకు జరిగింది. ఎంత వద్దనుకున్నా లోపలి నుంచి ఎసరు ఎగదన్నుకొస్తోంది.

"ఇయ్యాల భార్యనంటవు. రేపు జోలెవట్టుకునే జోగినివంటవు." తీక్షణంగా చూసింది.

"కాదు, కాదు గాంధారీ!"

"కాదూ... " ఆమెకు అసహ్యం అంగలేస్తుంది.

"ఇంకా మనం పశువులోలె ఉండొద్దు. చూడు దొరా! భారతంల గాంధారి కండ్లున్నా గుడ్డిదై కొడుకుల్ని చంపుకుంది. కాని... కాని నేను కలి యుగములుంటున్నా... కలికి గాంధారిని... నీ కొడుకు చావంగనే నీ వంశం ఖతమైంది. కాని నా మనుమనితో నా వంశం శురువైంది. తెల్సుకో!"

"అంతేనా... గాం... గాంధారీ?"

"అంతే. ఇప్పుడు నీ తొవ్వ నీది. నా తొవ్వ నాది." ఖాండ్రించి ఉమ్మి గాంధారి గిరుక్కున వెనుదిరి గింది. క్షణాల్లో బయటికొచ్చి గేటు దాటింది. ■